పెండింగ్ కేసులను పరిష్కరించాలి : ఎస్పీ శబరీష్

మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

ములుగురూరల్, జూలై 18 : పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో నెల వారీ నేర సమీక్ష నిర్వహించి కేసుల పురోగతి అడిగి తెలుసుకున్నారు. నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని, అన్ని ప్రధాన కూడళ్లలో అమర్చాలన్నారు. వానకాలంలో వరద ముంపు పొంచి ఉన్న ప్రాంతాలను గుర్తించి పోలీస్ శాఖ తరుపున తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఆకస్మికంగా వరదలు సంభవిస్తే గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. సమావేశంలో ఓఎస్డీ గీతే మహేశ్ బాబాసాహెబ్, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీలు రవీందర్, రాములు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

కృష్ణకాలనీ, జూలై 18: వాతావరణ శాఖ సూచన మేరకు జిల్లాలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌శర్మ, మున్సిపల్ కమిషనర్ టీ రాజేశ్వర్ అన్నారు. అత్యవసర సేవలకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ యంత్రాంగం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రానున్న ఐదు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఏ సమయంలో వర్షం వస్తుందో తెలీదు కాబట్టి ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొంగిపొర్లే వాగులు, రహదారుల్లో ప్రజలు రవాణా చేయకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర సేవలకు తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామ కార్యదర్శులను సంప్రదించాలని ప్రజలకు కలెక్టర్ సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లు, వరద నీరు ఇండ్లలోకి వస్తే మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఎమర్జెన్సీ నంబర్ 8978180036కు కాల్ చేయాలన్నారు. వెంటనే మున్సిపల్ సిబ్బంది తక్షణ చర్యలు తీసుకుంటారన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి : డీపీవో

మాట్లాడుతున్న డీపీవో నారాయణరావు

గణపురం, జూలై 18: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవితో కలిసి కాలనీ మొత్తం పరిశీలించారు. ఇళ్ల చుట్టూ శుభ్రం చేసుకొని దోమలు పెరుగకుండా చూసుకోవాలన్నారు. కాలనీలో రెండు మూడు చోట్ల నీరు నిల్వ ఉండగా తొలగించాలని జీపీ సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష, పంచాయతీ కార్యదర్శి విజేందర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

గ్రూప్స్ పరీక్షలు నెలరోజులు వాయిదా వేయాలి

కృష్ణకాలనీ, జూలై 18 : గ్రూప్- 2, 3 పరీక్షలను నెల రోజులు వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షలు ఈనెల 18 నుంచి ఆగస్టు 5 వరకు ఉన్నాయని, వారిలో గ్రూప్ -2, గ్రూప్ -3 అభ్యర్థులు కూడా ఉన్నారని తెలిపారు. గ్రూప్- 2 పరీక్షలు ఆగస్టు 7,8 తేదీల్లో ఉన్న నేపథ్యంలో డీఎస్సీ రాసేవారికి ప్రిపరేషన్ కోసం సమయం సరిపోదన్నారు. దీంతో నెల రోజులు పరీక్షలు వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నరేశ్, నాయకులు స్వామి, హాస్టల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత వైద్యం

మందులు అందజేస్తున్న వైద్యులు

ఏటూరునాగారం, జూలై 18 : మండల కేంద్రంలోని ఖలీల్ మెడికల్ స్టోర్స్ నిర్వాహకులు అజ్మత్‌ఖాన్, ముజీఫ్ ఆధ్వర్యంలో గురువారం చిన్నపిల్లల వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని డాక్టర్ వరప్రసాద్‌రావు ప్రారంభించారు. వైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి పిల్లలకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో పిల్లల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీ, సీపీఎం నాయకులు కృష్ణారెడ్డి, దావూద్, కాంగ్రెస్ నాయకులు రఘు, ఖలీల్, గౌస్, శిబిరం నిర్వాహకులు అజ్మత్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆక్రమణకు గురవుతున్న క్రీడా మైదానం

తొలగించిన గుర్రేవుల క్రీడా ప్రాంగణం నేమ్ బోర్డు

కన్నాయిగూడెం, జూలై 18 : మండలంలోని గుర్రేవుల గ్రామానికి కేటాయించిన క్రీడా మైదానంలోని బోర్డు, క్రీడా సామగ్రిని కొందరు తొలగించి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో వనిత, జీపీ కార్యదర్శి రంజిత్ అక్కడకు చేరుకొని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రుణమాఫీ ప్రక్రియ సాఫీగా పూర్తి చేయాలి

- గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు
- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

కృష్ణకాలనీ, జూలై 18 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రుణ మాఫీ ప్రక్రియ సాఫీగా పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రుణమాఫీ ప్రక్రియపై అవగాహన, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 16,502 మంది రైతులకు రుణమాఫీ జరుగుతున్నదన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి రైతు కుటుంబానికి రూ. 2 లక్షలు మాఫీ అవుతుందని తెలిపారు. మొదటి విడుత రూ.లక్ష లోపు బకాయిలు ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బు జమ అవుతుందన్నారు. రెండో విడుత ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్నట్లు చెప్పారు. బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ నంబర్, బ్యాంక్ వివరాలు తెలుసుకోవాలన్నారు. రుణ వివరాలు, రుణమాఫీ జరిగిన తరవాత మిగిలిన రైతుల వివరాలు సేకరించాలన్నారు. రుణ మాఫీ వచ్చిన వారి వివరాలు, రాని వారి వివరాలు పక్కాగా ఉండాలన్నారు. బ్యాంకుల్లో ప్రత్యేక సమయం, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రుణ మాఫీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు పాల్గొనాలని సూచించారు. రైతులు రుణ మాఫీకి దరఖాస్తు చేసేప్పుడు తప్పకుండా పట్టాదారు పాసుపుస్తకాలు, బ్యాంక్ పాసుపుస్తకాల జిరాక్స్ కాపీలను జతపరచాలని సూచించారు. 2023 డిసెంబర్ 9 వరకు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకుని ఇప్పటి వరకు తిరిగి చెల్లించని వారికి మీఫీ ఉంటుందన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అర్హుల జాబితా వ్యవసాయ శాఖ ద్వారా బ్యాంకులకు తెలియజేయనున్నట్లు చెప్పారు. సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు రాష్ట్ర స్థాయిలో గ్రీవెన్స్ పోర్టల్ ఏర్పాటు చేశారని, రైతులకు ఇబ్బందులు తలెత్తితే గ్రీవెన్స్ పోర్టల్‌లో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, లీడ్ బ్యాంక్ అధికారి తిరుపతి, వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంక్ బ్రాంచి మేనేజర్లు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి : కలెక్టర్ దివాకర

మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగురూరల్: రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ దివాకర సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అధికారులు, పీఏసీఎస్ చైర్మన్, సీఈవోలు, బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు తలెత్తితే పరిష్కరించేందుకు తొమ్మిది మండలకేంద్రాల్లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్ ద్వారా సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తారన్నారు. డీఈవో విజయ్‌చంద్ర, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజ్‌కుమార్, డీసీవో సర్దార్‌సింగ్, అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

డీఎంహెచ్‌వో మధుసూదన్‌రావు

మల్హర్ : రికార్డులను పరిశీలిస్తున్న మధుసూదన్‌రావు

మల్హర్/ కాటారం, జూలై 18 : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో మధుసూదన్‌రావు వైద్య సిబ్బందిని హెచ్చరించారు. గురువారం ఆయన మల్హర్ మండలం రుద్రారం, తాడిచర్ల, కాటారం పీహెచ్‌సీ, శంకరంపల్లి గ్రామ పంచాయతీలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. మేజర్ గ్రామాల్లో వారంలో ఒక్క రోజు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీల్లో ఎప్పటికప్పుడు మందులు సరిచూసుకొని లేనివి తెప్పించుకోవాలన్నారు. ముఖ్యంగా సిబ్బంది సమయ పాలనతో పాటు క్రమ శిక్షణ కలిగి ఉండాలన్నారు. తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని డాక్టర్ రాజుకు సూచించారు. వైద్యాధికారులు మౌనిక, గీత, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఆశ వర్కర్లు స్వరూప, పార్వతి, సుజాత, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

పద్మ (ఫైల్)

కాటారం, జూలై 18 : మండలంలోని జాదురావుపేటలో పాముకాటుతో నీలారపు పద్మ (50) మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పద్మ భర్త శంకర్ పదేళ్ల క్రితం మృతి చెందగా, తల్లి రాజక్కతో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నది. ముగ్గురు కూతుర్లు ఉండగా వారికి వివాహమైంది. మంగళవారం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కట్ల పాము కాటు వేసింది. దీంతో తల్లి రాజక్క, స్థానికుల సహాయంతో భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించా రు. అప్పటికే పరిస్థితి విషమించడంతో హనుమకొండ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

విద్యుత్ వాడకంపై జాగ్రత్తలు పాటించాలి

ములుగురూరల్, జూలై 18 : వానకాలంలో ప్రజలు విద్యుత్ వాడకంపై జాగ్రత్తలు పాటించాలని ములుగు విద్యుత్‌శాఖ ఎస్ఈ మల్బూర్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వానల కారణంగా బట్టలు ఆరవేసే వైర్లు, గృహాల్లో విద్యుత్ వైర్లలో లోపాల కారణంగా ఇనుప వస్తువులకు విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రజలు విద్యుత్ వాడకంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. నాణ్యమైన వైరింగ్ లేకపోవడంతో పాటు ఇతర కారణాలతో విద్యుత్ ప్రమాదాలు జరుగుతాయని, ఈ విషయాన్ని గుర్తించాలని సూచించారు. రైతులు వ్యవసాయ పంపుసెట్లను వినియోగించే ముందు కూడా జాగ్రత్తలు పాటించాలన్నారు.

బంజారా ఐక్యవేదిక పట్టణ కమిటీ ఎన్నిక

ములుగురూరల్, జూలై 18 : బంజారా కులస్తులు గురువారం ములుగులో సమావేశమై బంజారా ఐక్యవేదిక పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూక్యా సోమానాయక్, ప్రధాన కార్యదర్శిగా పోరిక సునీల్‌కుమార్, కోశాధికారులుగా కుమార్‌పాడ్య, పోరిక జయరాంను ఎన్నుకున్నారు. అదే విధంగా ఐక్య వేదిక గౌరవాధ్యక్షుడిగా పోరిక గోవింద్‌నాయక్, కోర్ కమిటీ డైరెక్టర్లుగా బాలూనాయక్, మోహన్‌లాల్, సర్వాన్‌నాయక్, హట్కూర్ సమ్మయ్య, సారయ్య, సమ్ములు, మోతీలాల్, భూక్యా సమ్మయ్యను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా లావుడ్య రమేశ్, ఆంగోత్ రాజునాయక్, అనంతరామ్‌నాయక్, రఘురామ్‌నాయక్, రాహుల్‌నాయక్‌ను, కార్యదర్శులుగా స్వామిదాస్, కసన్‌సింగ్, ప్రచార కార్యదర్శులుగా సమ్మయ్య, జయపాల్, సునిల్, తిరుపతిని, సాంస్కృతి కార్యదర్శులుగా శ్యామల్‌నాయక్, గోపీసింగ్, సంయుక్త కార్యదర్శులుగా రమేశ్, సాంబయ్య, లింగానాయక్, శంకర్‌ను, ఆహ్వాన కమిటీ సభ్యులుగా జంపన్న, దేశాయి, రాజారామ్‌ను ఎన్నుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న వైద్యాధికారిణి భవ్యశ్రీ

వెంకటాపురం(నూగూరు), జూలై 18: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎదిర వైద్యాధికారిణి భవ్యశ్రీ సూచించారు. గురువారం మండల పరిధిలోని లక్ష్మీనగరం బాలుర ఆశ్రమ పాఠశాల, చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలల్లో వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించడంతో పాటు రక్తనమూనాలను సేకరించి, మందులు అందజేశారు. భవ్యశ్రీ మాట్లాడుతూ విద్యార్థులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్యాధికారులు అశీష్, సహోల్, జ్యోతి, సిబ్బంది యాకలక్ష్మి, రామకృష్ణ, రాజేశ్, భూపతి, స్వరూప పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఏటూరునాగారం, జూలై 18 : ఆటో యూనియన్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా తాళ్లపల్లి కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎం తిరుపతి, ఎస్కే రఫీ, కార్యదర్శిగా కూనూరు కృష్ణ, కోశాధికారిగా తాళ్లపల్లి నరేందర్, సహాయ కార్యదర్శిగా గడ్డం సతీశ్, గౌరవాధ్యక్షుడిగా శివకుమార్, కిరణ్, మహేశ్‌ను ఎన్నుకున్నారు. కొంత మందిని సభ్యులుగా నియమించారు.

మత్తుకు బానిస కావొద్దు

కాటారం/ టేకుమట్ల, జూలై 18 : మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని ఎస్సైలు అభినవ్, ప్రసాద్ విద్యార్థులు సూచించారు. గురువారం కాటారం మండలం గంగారం మోడల్ స్కూల్, టేకుమట్ల మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఎస్సైలు పాల్గొని విద్యార్థులకు సూచనలు చేశారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ హక్కుల పట్టాలకు పంట రుణాలివ్వాలి

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

కాటారం, జూలై 18 : అటవీ హక్కుల పట్టాలకు పంట రుణాలు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మండల కేంద్రంలో సంఘం సమావేశం జిల్లా అధ్యక్షుడు సూదుల శంకర్ అధ్యక్షతన జరిగింది. ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల పత్రాలకు పంట రుణాలు ఇవ్వడం లేదన్నారు. పోడు రైతుల మీద ప్రభుత్వాలు వివక్ష విడనాడాలని అన్నారు. ఆగస్టు 9న కాటారంలో జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవానికి పెద్ద సంఖ్యలో ఆదివాసీలు, మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల రాజు, శ్రీను, శరత్, విజయ్, వినోద్ పాల్గొన్నారు.

క్యాంటీన్ ఏర్పాటుకు అదనపు కలెక్టర్ పరిశీలన

ఏటూరునాగారం, జూలై 18 : మండలకేంద్రంలోని పలు ప్రాంతాల్లో అడిషనల్ కలెక్టర్ శ్రీజ పర్యటించారు. ఎస్సీకాలనీలోని డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రాంతాన్ని పరిశీలించి, పరిసరాల శుభ్రతపై ఆరా తీశారు. వర్షం నీరు వెళ్లడానికి అవసరమైన ట్రెంచ్‌ను తీసేందుకు సంబంధిత రైతులతో మాట్లాడాలని తహసీల్దార్ జగదీశ్వరకు సూచించారు. పారిశుధ్య పనులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించారు. గతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఉన్న పంచాయతీ భూమిని పరిశీలించారు. ఈ విషయమై డీఎఫ్‌వోతో చర్చించనున్నట్లు పంచాయతీ అధికారులకు తెలిపారు. ఐటీడీఏ వద్ద మహిళలతో క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేశారు. ఐటీడీఏ కార్యాలయం వెనుక వైపు, ముందు భాగంలో ఉన్న అనుకూల ప్రదేశాన్ని వీక్షించారు. ఏపీవో వసంతరావుతో ఈ విషయమై మాట్లాడారు. ఎండీపీవో రాజ్యలక్ష్మి, ఎంపీవో కుమార్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, మండల సమాఖ్య సీఏలు సమ్మక్క, సరోజన పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన..

వంతెన పనులు పరిశీలిస్తున్న అధికారు

టేకుమట్ల, జూలై 18 : మండలంలోని టేకుమట్ల- రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య చలివాగుపై పునఃనిర్మిస్తున్న వంతెన పనులను గురువారం తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీవో సురేశ్‌తో కలిసి అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా నాణ్యతతో వేగంగా వంతెన నిర్మించి రవాణా ఇబ్బందులు తీర్చాలన్నారు. అంత వరకు ప్రజలు వంతెన గడ్డరపై నుంచి, తెగిన వాగు నుంచి నడువొద్దని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ సంతోష్, కార్యదర్శి సాంబశివుడు తదితరులు ఉన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

గణపురం, జూలై 18 : ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన ఐదు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు దూలం కుమారస్వామిగౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమన్నారు. పీఆర్సీ ఇస్తామని చెప్పి ఊసే ఎత్తడంలేదని మండిపడ్డారు. పీజీ హెచ్ఎం. ఎస్ఏ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులకు పదోన్నతులు కల్పించాలన్నారు. అన్ని ఆఫీసుల్లో సబార్డినేట్ పోస్టులు, స్కావెంజర్ పోస్టులు నింపాలన్నారు.

కేజీబీ పాఠశాలను సందర్శించిన వైద్య బృందం

మంగపేట, జూలై 18 : మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను గురువారం పీహెచ్‌సీ వైద్యురాలు వైశాలి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల కోసం తయారు చేసిన వంటలు, తాగునీరు, వసతి గృహాన్ని పరిశీలించారు. అనంతరం వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించారు.

కళాశాల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

తాడ్వాయి, జూలై 18 : మండలకేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యార్థులు ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న పీవో చిత్రా మిశ్రా కళాశాలకు చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పీవోకు వివరించారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నాను విరమించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో చిత్ర మిశ్రా

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

OLD AGE HOME
★ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325763

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 JANGAON
9182777565 MAHABUBABAD
9182777557

రైతులకు అండగా ప్రభుత్వం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ
- రుణమాఫీని హర్షిస్తూ ములుగు, జయశంకర్ జిల్లాల్లో పాలాభిషేకాలు
- రైతు వేదికల్లో సీఎం ప్రసంగాన్ని వీక్షించిన రైతులు


చిట్యాల : సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల/ గణపురం/ టేకుమట్ల/ రేగొండ, జూలై 18 : రుణ మాఫీ చేసి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం రూ. లక్ష లోపు ఉన్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేయడంతో ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క చిత్ర పటాలకు కాంగ్రెస్, శ్రేణులు, రైతులు క్షీరాభిషేకాలు చేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆయా జిల్లాల్లోని రైతుల వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు సీఎం రేవంత్ ప్రసంగాన్ని వీక్షించారు. చిట్యాల, రేగొండ, టేకుమట్ల, మొగుళ్లపల్లి, గణపురం మండలాల్లో నిర్వహించిన ర్యాలీల్లో ఎమ్మెల్యే జీఎస్ఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మాట ఇస్తే మడమ తిప్పని ఏకైక పార్టీ కాంగ్రెస్ అని, ఏరువాక పౌర్ణమి రోజే రైతులకు రుణమాఫీ బరువు దించిన ప్రభుత్వానికి, రైతులు శుభాకాంక్షలు తెలపడమే కాకుండా ఎల్లప్పుడూ అండగా ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర అధికారప్రతినిధి గాజర్ల అశోక్, భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య, జిల్లా కార్యదర్శి వైనాల రవీందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, కాటారంలో మంత్రి శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు, అదనపు కలెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

ములుగు, జయశంకర్ జిల్లాల్లో భారీ వర్షం

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- ఉప్పొంగిన వాగులు, నిలిచిన రాకపోకలు

మల్హర్ : వర్షంతో నిలిచి పోయిన బొగ్గు ఉత్పత్తి వాహనాలు

నమస్తే నెట్‌వర్క్, జూలై 18 : ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో బుధవారం రాత్రి నుంచి ఏకధాటిగా భారీ వర్షం కురుస్తున్నది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులు, వాగులకు వరద పోటెత్తుతున్నది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగ